నమస్తే తెలంగాణ
మెదక్
I హైదరాబాద్, ఆదివారం 30 మార్చి 2025 MEDAK

విశ్వావసులో విజయాలు సిద్ధించాలి

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపిన హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 29: తెలుగు నూతన సంవత్సరాది శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరాన్ని ఆనందోత్సాహాలు, సుఖసంతోషాలతో అన్నివర్గాల ప్రజలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ ఉగాది పచ్చడిలాగే మీ జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరుతూ.. ఈ ఉగాది మీ కష్టాలకు ముగింపు, మీ విజయాలకు ఆరంభం కావాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరం అన్నిరంగాల్లో పురోభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. పదేండ్లలో తెలంగాణ అన్నిరంగాల్లో అద్భుతమైన ప్రగతి సాధించి పురోగమనంలోకి వచ్చిందని, ఈ పదిహేను నెలల్లో సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర పేరు ప్రతిష్టలు తిరోగమనంలోకి వెళ్లాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ధోరణితో సాగునీటి ఇబ్బందులు తలెత్తి రైతులు ఆందోళన చెందుతున్నారని, ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురువాలని, రైతులు ఆనందంతో పాడి పంటలతో వర్ధిల్లాలన్నారు. అన్నింటా శుభం జరగాలని, అందరి కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపాలని హరీశ్‌రావు ఆకాంక్షించారు.

ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం

కాళ్లకల్‌లో ఎమ్మెల్సీ కవితకు స్వాగతం పలుకుతున్న ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్

మనోహరాబాద్, మార్చి 29: నిజామాబాద్ జిల్లా పర్యటనకు బయలుదేరిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మనోహరాబాద్ మండలం కాళ్లకల్ బంగారమ్మ దేవాలయం వద్ద శనివారం మాజీ జడ్పీ చైర్‌పర్సన్ ర్యాకల హేమలతాశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంఘం నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, పూర్ణకుంభంతో ఆలయంలోకి స్వాగతం పలికారు. అనంతరం బంగారమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి ముదిరాజ్, మండల ఉపాధ్యక్షుడు రతన్‌లాల్, యూత్ అధ్యక్షుడు రాహుల్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు నరేశ్ ముదిరాజ్, కుమార్, నరేందర్‌గౌడ్, పంజా భిక్షపతి, నూకల వెంకటేశ్ పాల్గొన్నారు.

ఐఐటీహెచ్‌లో పబ్లిక్ హ్యుమానిటీస్

ఇనిషియేటివ్ ప్రారంభం

ఐఐటీహెచ్‌లో పీహెచ్ఐ ప్రారంభోత్సవంలో పాల్గొన్న డైరెక్టర్ బి.ఎస్.మూర్తి, ప్రొఫెసర్లు, విద్యార్థులు

కంది, మార్చి 29: సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌లో పబ్లిక్ హ్యుమానిటీస్ ఇనిషియేటివ్ (పీహెచ్ఐ)ని శనివారం ప్రారంభించినట్లు ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి తెలిపారు. డాక్టర్ షుహితా భట్టాచార్జీ నేతృత్వంలో ఈ పీహెచ్ఐ ప్రారంభించారు. వినూత్న విద్యా అభ్యాసాల ద్వారా క్లిష్టమైన సామాజిక సమస్యలను పరిష్కరించడం, హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ మధ్య అంతరాన్ని తగ్గించడం, డిసిప్లినరీ పరిశోధన సంభాషణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పీహెచ్ఐ దోహదపడనున్నది. ఈ సందర్భంగా లిబరల్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అనుబంధ ఫ్యాకల్టీ ఆఫ్ డిజైన్ డాక్టర్ షుహితా భట్టాచార్జీ మాట్లాడుతూ.. పీహెచ్ఐ అనేది సామాజికంగా, రాజకీయంలో కీలకమన్నారు. ఐఐటీహెచ్ పబ్లిక్ హ్యుమానిటీస్ ఇనిషియేటివ్ దేశంలోని అతి కొద్ది పబ్లిక్ హ్యుమానిటీస్ హబ్‌ల్లో ఒకటిగా ఉంటుందని, ఇది దక్షిణాసియా సెంటర్ స్టేజ్‌లోని సమస్యలను గుర్తించగలదని, ఇది మానవీయ శాస్త్రాలు, కళ రూపకల్పన, స్పష్టమైన రూపాంతర ప్రాముఖ్యతను నెలకొల్పుతుందన్నారు. ఐఐటీహెచ్ డైరెక్టర్ మూర్తి మాట్లాడుతూ.. పీహెచ్ఐ ఒక ముఖ్యమైన దశను సూచిస్తుందని, వినూత్న విద్యాపరమైన వాస్తవాలను ప్రచ ప్రభావానికి మార్గం సుగమం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు ప్రమోద్‌నాయర్, పుష్పేష్‌కుమార్, శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులపై కేసులు ఎత్తివేయాలి

- **డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి**

మాట్లాడుతున్న బట్టు అంజిరెడ్డి

ములుగు, మార్చి 29: రైతులపై అధికారులు అక్రమ కేసులుపెట్టి భయభ్రాంతులకు గురిచేయడం అప్రజాస్వామికమని డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో వివిధ రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ఎండిపోతుంటే చూడలేక రైతులు కాలువకు గండికొట్టి నీరందిస్తే 9 మందిపై నీటిపారుదల శాఖ అధికారులు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. నర్సంపల్లిలో కాలువ ద్వారా తమ పొలాలకు నీరందించాలని ఏడాదిగా రైతులు నీటిపారుదల శాఖ అధికారులకు విన్నవిస్తే పట్టించుకోవడం లేదన్నారు. వారి సమస్య పరిష్కరించకుండా కేసులు పెట్టడంపై అధికారుల తీరును ఆయన ఖండించారు. రైతులకు ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం చివరికి వారిపై కేసులు పెట్టి పాపాన్ని మూటగట్టుకుందని విమర్శించారు. భేషరుతుగా రైతులపై కేసులు ఎత్తివేసి అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పంటలు ఎండిపోకుండా కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా చెరువులకు, కుంటలకు నీరందించాలని సూచించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు లింగారెడ్డి, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, రాజిరెడ్డి, రైతులు ఉన్నారు.

వృద్ధాశ్రమానికి విరాళం

వృద్ధాశ్రమంలో దవాఖాన నిర్వాహకులు, యాజమాన్యం

అమీన్‌పూర్, మార్చి 29: అమీన్‌పూర్ మున్సిపాలిటీ శ్రీవాణినగర్‌లో ఉన్న ది నెస్ట్ వృద్ధాశ్రమానికి హాస్టల్ ప్రైమ్ దవాఖాన నిర్వాహకులు రూ.3 లక్షల విలువైన మందులు, ఇతర సామగ్రి విరాళంగా అందజేశారు. ది నెస్ట్ వృద్ధాశ్రమం నిర్వాహకురాలు అరుణ వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సమాజసేవ చారిటబుల్ ట్రస్టీ పార్థసారథి, మాణిక్‌రావు పాటిల్, కృష్ణారెడ్డి, ప్రసాద్, దవాఖాన యాజమాన్యం తరపున దేవానంద్, బిజినెస్ (హెచ్ఓడీ) రవికుమార్, కృష్ణకుమార్, పెంచల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్వహణ లోపం.. ప్రజలకు శాపం!



సంగారెడ్డిలోని రాజంపేటలో 15వ వార్డులో మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న మహిళలు

కంది గ్రామంలో తాగునీటి సమస్య కారణంగా మంజీరా పైప్‌లైన్ లీకేజీ నీటిని బాటిళ్లలో పట్టుకుంటున్న చిన్నారులు

ఇంటింటికీ సురక్షిత తాగునీటిని అందించేందుకు కేసీఆర్ ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ పథకం కాంగ్రెస్ పాలనలో నిర్వహణ లోపంతో సతమతమవుతున్నది. దీంతో ప్రజలకు తరుచూ నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. నిధులు లేమి, ప్రభుత్వ నిర్లక్ష్యం, సిబ్బందికి వేతనాలు పెండింగ్ తదితర కారణాలతో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నది. వేసవి కావడంతో సమస్య తీవ్రతతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సంగారెడ్డి జిల్లాలో మొదలైన నీటి కష్టాలు

కాంగ్రెస్ పాలనలో విఫలమవుతున్న నీటి సరఫరా వ్యవస్థ

- **మిషన్ భగీరథ నీటి సరఫరాలో సమస్య**
- **సిబ్బందికి మూడు నెలల వేతనాలు పెండింగ్**
- **నీటి కోసం జనం ఇబ్బందులు**
- **పంచాయతీల్లో నిధుల లేమితో నోచుకోని మరమ్మతులు**
- **ట్యాంకర్లను ఆశ్రయిస్తున్న ప్రజలు**

సంగారెడ్డి, మార్చి 29(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో ప్రజలకు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. ఓవైపు భూగర్భ జలమట్టాలు తగ్గుముఖం పట్టడం, మరోవైపు మిషన్ భగీరథ నిర్వహణ లోపాల కారణంగా తాగునీటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మిషన్ భగీరథ నిధులకు ప్రభుత్వ కోతలు విధించడం, కరెంటు కోతలు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి వేతనాలు ఇవ్వకపోవడంతో తాగునీటి సరఫరాలో సమస్యలు ఎదురవుతున్నాయి. మిషన్ భగీరథ పథకంలో పనిచేసే కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందలేదు. దీంతో వారు మరోసారి ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో తాగునీటి సరఫరాపైనా ప్రభావం పడుతున్నది. పైప్‌లైన్ లీకేజీ సమస్యలు తలెత్తితే వెంటనే మరమ్మతులు చేయించక పోవడంతో నీటికోసం గ్రామీణ ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్, అందోలు, జహీరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో తాగునీటి సమస్యల తలెత్తుతున్నాయి. ముఖ్యంగా మిషన్ భగీరథ పంప్‌హౌస్, సంప్‌హౌస్‌ల వద్ద మోటర్లు కాలిపోవటం, పైప్‌లైన్లు లీకేజీలు కావడం తదితర సమస్యలతో తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మిషన్ భగీరథకు నిర్వహణ లోపం...

బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ మానస పుత్రిక 'మిషన్ భగీరథ' ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంటింటికీ నల్లాల ద్వారా సరక్షిత నీటిని సరఫరా చేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అందుబాటులోకి వచ్చిన తర్వాత కలుషిత జలాల పంపిణీకి చెక్ పడింది. దీంతో కలుషిత జలాలతో సంక్రమించే జబ్బులు తగ్గుముఖం పట్టాయి. సంగారెడ్డి జిల్లాలో రూ.1689 కోట్లతో మిషన్ భగీరథ పథకంలో గ్రామాల్లో 3006 కిలోమీటర్లు, పట్టణాల్లో 559 కిలోమీటర్ల పైప్‌లైన్లు వేశారు. 11 సంప్‌హౌస్‌లు, 1467 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల్లో 2,88,719, పట్టణాల్లో 37వేల నల్లా కనెక్షన్ల ద్వారా కేసీఆర్ హయాంలో తాగునీటి సరఫరా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నిర్వహణ పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వం సరైన నిధులు ఇవ్వకపోవడం, నిర్వహణ లోపాల కారణంగా గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. జిల్లాలోని ఇంకా 1467 నివాసాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేయాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

గ్రామాల్లో ప్రారంభమైన నీటి సమస్య

నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఒకరోజు విడిచి ఒకరోజు తాగునీరు సరఫరా చేస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ నియోజకవర్గంలో మిషన్ భగీరథ పథకం నిర్వహణ సరిగ్గా లేదు. మోటర్లు కాలిపోయినా, పైప్‌లైన్‌లు లీకేజీ అయినా సిబ్బంది వెంటనే మరమ్మతు చేయకపోవడంలో నీటి సరఫరా నిలిచిపోతున్నది. నాగల్‌గిద్ద మండలం రత్నానాయక్ తండా, కొండ్యానాయక్ తండాతో పాటు ఇతర తండాల్లో నీటి సమస్య ప్రారంభమైంది. కంగ్టి మండలంలోని బోర్గి, దెగుల్‌వాడి, చౌకట్‌పల్లి, నాగూర్(బి)గ్రామాల్లో నీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు మూడు రోజులకు ఒకసారి నీరు సరఫరా అవుతున్నది. మిషన్ భగీరథ నిర్వహణ లోపం కారణంగా ఇటీవల మనూరు మండలంలోని ఎల్గోయి, అంతిమ్యాల్, ఎన్‌జీ హుక్రానా, తోర్నాల్ గ్రామాల్లో నీటి సరఫరా నిలిచిపోయింది. ఝరాసంగం మండలం వనంపల్లి, గోప్యానాయక్ తండాల్లో నీటి సమస్య నెలకొంది. వనంపల్లిలో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా సరిగ్గా జరగడం లేదు. గ్రామంలో రెండు సింగిల్‌ఫేజ్ మోటర్లు ఆగిఆగి నీళ్ల పోయడంతో ట్యాంకులు నిండడం లేదు. ఝరాసంగం మండలంలోని చీలపల్లి, ఎల్గోయి, కుప్సానగర్, పొట్టిపల్లి గ్రామాలకు మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. సంగారెడ్డి మండలం చెర్యాల్‌తో పాటు పలు గ్రామాల్లో తాగునీటి సమస్య ప్రారంభమైంది. అందోలు మండలం కంసాన్‌పల్లి, వట్‌పల్లి మండలం బిజిలీపూర్ గ్రామంలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సంగారెడ్డి, అందోలు, జహీరాబాద్, నారాయణఖేడ్ మున్సిపాలిటీల్లో సైతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటి నీటి సరఫరాలో తరుచూ సమస్యలు తలెత్తుతుండడంతో ప్రజలకు నీటి కష్టాలు తప్పడం లేదు. సంగారెడ్డి, పటాన్‌చెరు ప్రాంతాల్లో నీటిఎద్దడి ఎక్కువగా ఉంది. మిషన్ భగీరథ నీరు సరిపోక ప్రజలు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు.

సంగారెడ్డి పట్టణంలోని గొల్లగూడెం 15వ వార్డు హైదరాబాద్ వెళ్లే మంజీరా పైపులైన్ లీకేజీ అయిన దృశ్యం

మిషన్ నీళ్లు.. డ్రైనేజీ పాలు

- **పగిలిన మిషన్ భగీరథ పైప్‌లైన్..**
- **రోడ్డు విస్తరణ పనులతో తరుచూ కష్టాలు**
- **ముత్తంగి రోడ్లపై పారుతున్న తాగునీరు**
- **ముత్తంగి, చిట్కుల్‌లో 20 రోజులుగా నల్లానీరు బంద్**
- **దాహంతో అల్లాడుతున్న ప్రజలు**
- **చేతులెత్తేసిన మున్సిపాలిటీలు**

మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారుల సమన్వయ లేమితో 40వేల జనాభా ఉన్న చిట్కుల్, ముత్తంగి తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ముత్తంగిలో విజేత కాలనీ రోడ్లపై మిషన్ భగీరథ నీరు వృథాగా పారుతున్నది. ప్రజలు తాగాల్సిన తాగునీరు మురుగు కాలువల్లోంచి సక్కవాగువైపు వృథాగా వెళ్తున్నాయి. ఇదే ముత్తంగి గ్రామానికి 24 రోజులుగా తాగునీరు రావడం లేదు. చిట్కుల్‌లో 20 రోజులుగా తాగునీరు నిలిచిపోయింది. ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయడం లేదు. జాతీయ రహదారి విస్తరణ పనులతో వారంలో ఒకసారి మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి సమస్య ఉత్పన్నమవుతున్నది. ప్రస్తుతం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నిర్మిస్తున్న కల్వర్టు వద్ద పైపులు పగిలిపోయాయి. హైవే పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌తో సమన్వయం కుదరక పైపులు తరుచూ ధ్వంసమవుతున్నాయి. దీంతో మండు వేసవిలో చిట్కుల్,ముత్తంగి గ్రామాల్లో ప్రజలు నీటికి అల్లాడుతున్నారు.

ముత్తంగి విజేత కాలనీ రోడ్డుపై పారుతున్న తాగునీరు

పటాన్‌చెరు, మార్చి 29: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం ముత్తంగి, చిట్కుల్ గ్రామాల్లో తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. జాతీయ రహదారిని విస్తరణ పనులు చేపడుతుండడంతో ఈ గ్రామాలకు నీటిని సరఫరా చేసే పైపులు తరుచూ పగిలి నీటి సరఫరా నిలిచిపోతున్నది. పగిలిన పైపులకు మరమ్మతులు చేయడం, పక్కనుంచి కొత్త లైను వేసే ఆలోచన అధికారులు చేయడం లేదు. దీంతో నీటి వృథా జరుగుతున్నది. దీంతో దాదాపు ఆరునెలలుగా ముత్తంగి, చిట్కుల్‌లో నీటి సమస్య తలెత్తుతున్నది. నాలుగు నెలల క్రితం ముత్తంగిలో రెండున్నర నెలలు పాటు తాగునీరు సరఫరా నిలిచిపోయింది. ఇప్పుడు కూడా 24రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ముత్తంగి గ్రామంలో, దత్తాత్రేయ కాలనీలో రెండు మిషన్ భగీరథ కనెక్షన్లు ఉన్నాయి. ఈ కనెక్షన్ల ద్వారా పలు కాలనీలకు నీటిని సరఫరా చేస్తారు. పగిలిన మెయిన్ పైప్‌లైన్‌ను మిషన్ భగీరథ అధికారులు, పగులగొట్టిన కాంట్రాక్టర్ మరమ్మతులు చేయడం లేదు. కల్వర్టులు, ఇతర బ్రిడ్జిలు నిర్మాణంలో ఉన్నచోట తాత్కాలికంగా పైపులు వేసి నీటిని ఇచ్చే అవకాశం ఉన్నా పట్టించుకోవడం లేదు. ముత్తంగిలో జాతీయ రహదారి నుంచి విజేత కాలనీకి వెళ్లే దారిలో పైప్‌లైన్ పగిలి వేలాది లీటర్ల తాగునీరు వృథాగా పోతూ, నేరుగా మురుగుకాలువల్లో కలుస్తున్నది. దాహం తీర్చాల్సిన తాగునీరు రోడ్లపై వృథాగా పారుతుండడంతో ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిషన్ భగీరథ అధికారులు ఎన్ని రోజులు నీరు ఇవ్వకున్నా మున్సిపాలిటీ అధికారులు స్పందించడం లేదు. మిషన్ భగీరథ ఇంట్రాలో ఉన్న తాగునీటి పంపిణీ బాధ్యతలను గతేడాది పంచాయతీలకు బదలాయించారు. ముత్తంగి, చిట్కుల్ గ్రామ పంచాయతీలు ఇప్పుడు తెల్లాపూర్, ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో కలపడంతో తాగునీటి సరఫరా బాధ్యతలు మున్సిపాలిటీలు చూడాలి. ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇస్నాపూర్‌కు నీటిని అందజేస్తున్నా, చిట్కుల్‌లో నీటి సరఫరాను నిర్లక్ష్యం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ అధికారులు ముత్తంగిలో తాగునీటి పంపిణీ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వీరి తీరుతో ప్రజలకు తాగునీరు కరువైంది.

భూగర్భ జలాలు కలుషితం...

పరిశ్రమల కాలుష్యంతో ముత్తంగి, చిట్కుల్ గ్రామాల్లో భూగర్భ జలాలు కలుషితమయ్యాయి. వీటిని తాగడానికి కాదు కదా వాడటానికి కూడా పనికిరావని నిపుణులు హెచ్చరించారు. ఈ కాలుష్య పీడిత గ్రామాలకు తాగునీరు ఉచితంగా ఇవ్వాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. చిట్కుల్, ముత్తంగిలో తాగునీటి సరఫరా అస్తవ్యస్తం కావడానికి మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు, హైవే విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రత్యేకాధికారుల పాలన కావడంతో వారు రిపోర్టుల పంపకం పేరున కాలయాపన చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ఉన్నప్పుడు సర్పంచ్‌లు, మున్సిపల్ చైర్మన్లు ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేసేవారు. ప్రత్యేకాధికారుల ఆ పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి.

20రోజులుగా నీరు ఇవ్వట్లేదు..

చిట్కుల్‌లో ఇరవై రోజులుగా తాగునీరు రావడం లేదు. మా గ్రామాన్ని ఇస్నాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఇప్పుడ సమస్య మరింత తీవ్రమైంది. ఉగాది తరువాత ఖాళీ బిందెలతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తాం. చిట్కుల్‌కు వచ్చే భగీరథ నీటి కనెక్షన్ సరిచేసి త్రివేణి స్కూల్ వద్దనుంచి వేయాలి. అప్పుడే గ్రామానికి నీళ్లు సరిగ్గా వస్తాయి. ఇప్పుడు గ్రావిటీ ఫెయిల్ అయ్యింది. మిషన్ భగీరథ అధికారులు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో సమస్యను పరిష్కరించాలి.

-సుంకరి రవీందర్, మాజీ సర్పంచ్ చిట్కుల్



ముత్తంగిలో నిర్మాణంలో ఉన్న కల్వర్టులో నిండిన మిషన్ భగీరథ తాగునీరు

విద్యార్థి మృతితో ఆందోళన

మృతదేహంతో రాస్తారోకో

- **రూ.10 లక్షలు, ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్**
- **గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం: నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి విమర్శ**

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 29: హైదరాబాద్‌లోని ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నల్లవాగు గురుకుల పాఠశాల విద్యార్థి దార నిఖిల్ కుమార్(14) మృతి చెందడంతో ఉద్రిక్తత పరిస్థితులు చోటుచేసుకున్నాయి. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నిర్లక్ష్యంతోనే విద్యార్థి మృతి చెందాడని విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు రోడ్డుపై శనివారం ధర్నా చేశారు. దార నిఖిల్ కుమార్ మెదక్ జిల్లా పెద్దశంకరంపేట్ మండలం చీలపల్లి స్వగ్రామం. వారం క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. అతని ఆరోగ్యం దెబ్బతినడంతో 26న పాఠశాల ప్రిన్సిపాల్ తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వెంటనే విద్యార్థి కుటుంబీకులు తొలుత నారాయణఖేడ్‌లోని ప్రైవేట్ దవాఖానలో చేర్పించారు. అక్కడి వైద్యులు సంగారెడ్డికి తీసుకెళ్లాలని సూచించారు. సంగారెడ్డి తరలించి అక్కడ ప్రైవేట్ దవాఖానలో వైద్యం చేయించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండడంతో వైద్యుల సూచనతో హైదరాబాద్‌కు తరలించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం సాయంత్రం విద్యార్థి నిఖిల్ మృతిచెందాడు. తమ కుమారుడి మృతికి గురుకుల పాఠశాల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటూ తల్లిదండ్రులు, బంధువులు ఆరోపిస్తూ విద్యార్థి మృతదేహంతో గురుకుల పాఠశాల ముట్టడికి దళిత నాయకుడు అలిగే జీవన్ ఆధ్వర్యంలో యత్నించారు. పోలీసులకు సమాచారం అందడంతో మార్గమధ్యలో వారిని అడ్డుకుని గురుకుల పాఠశాల వైపు రాకుండా నివారించారు. దీంతో వారు రోడ్డు పైనే బైఠాయించి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ వచ్చి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన విషయం తెలుసుకున్న నారాయణఖేడ్ ఆర్డీవో అశోక చక్రవర్తి ఘటనా స్థలానికి చేరుకుని గురుకుల పాఠశాలల ఆర్‌సీవో నిర్మలతో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే విద్యార్థి అంత్యక్రియల కోసం రూ.50వేలు నగదు అందజేసి, ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా 'ఖేడ్' సీఐ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

విద్యార్థి నిఖిల్ (ఫైల్)

ఆందోళనలో పాల్గొన్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

గురుకులాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం: మాజీ ఎమ్మెల్యే

కాంగ్రెస్ పాలనలో గురుకులాలు అధ్వానంగా తయారయ్యాయని, అందుకే గురుకుల విద్యార్థి నిఖిల్ మృతిచెందాడని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు చేపట్టిన ధర్నా వద్దకు చేరుకుని ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పాలనలో గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్య, భోజనం అందించారన్నారు. ఇప్పుడు గురుకులాలు అధ్వానంగా తయారై విద్యార్థుల పాలిట శాపాలుగా మారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహించిన పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థి కుటుంబానికి రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించి, ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

నిఖిల్ కుటుంబాన్ని ఆదుకోవాలి

- **మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు**

సంగారెడ్డి, మార్చి 29(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం నల్లవాగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి నిఖిల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.15 లక్షల పరిహారం అందజేయాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యార్థులు చనిపోతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 83 మంది గురుకుల విద్యార్థులు చనిపోయారని, ప్రభుత్వం కనీస దిద్దుబాటు చర్యలు చేపట్టడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక గురుకులంలో 400 మంది విద్యార్థులనే సమర్థవంతంగా చూసుకోలేని ప్రభుత్వం రెండువేల మంది ఉండే ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్వహణ ఎలా చేయగలదని ప్రశ్నించారు. గురుకులాల్లో చదువుతున్న దళిత, బహుజన విద్యార్థుల ప్రాణాలను రక్షించే చర్యలు ప్రభుత్వం చేపట్టాలన్నారు.